సాక్షి
నిజామాబాద్

శుక్రవారం ı 27 ı జూన్ ı 2025



గోపాల మిత్రల గోడు పట్టదా!

పాడి పరిశ్రమలో కీలకపాత్ర పోషిస్తున్న గోపాలమిత్రలకు ప్రభుత్వం నుంచి జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



మొలకెత్తని సోయా విత్తనాలు

మార్కెట్లో దొరుకుతున్న విత్తనాలతో రైతులు మోసపోతున్నారు. అవి నకిలీవో, మంచివో తెలియక కొనుగోలు చేసి విత్తుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /22.7

ఉదయం చల్లని ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఐకేపీలో డీపీఎంల బదిలీలు

- ముగ్గురికి స్థాన చలనం

డొంకేశ్వర్(ఆర్మూర్) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ల (డీపీఎం) బదిలీలు జరిగాయి. హైదరాబాద్‌లో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అధ్వర్యంలో బుధవారం జరిగిన బదిలీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు డీపీఎంలకు స్థాన చలనం కలిగింది. శ్రీనివాస్, సాయిలు కామారెడ్డి జిల్లాకు అలాగే మారుతి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న మరో ముగ్గురికి స్థానచలనం కలుగలేదు. అదే విధంగా ఇతర జిల్లాల నుంచి ముగ్గురు డీపీఎంలు జిల్లాకు వస్తున్నారు. అందులో మెదక్ నుంచి మోహన్, సిద్దిపేట నుంచి కిరణ్, నిర్మల్ నుంచి రాజేశ్వర్ ఉన్నారు. వీరు రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. అయితే, ఎవరికి ఏ సెక్షన్లు ఇవ్వాలనేది సెర్ప్ సీఈవోనే నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, డీపీఎంలకు ఇది వరకు ఉన్న విభాగాలు కాకుండా కొత్త విభాగాలు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఎస్సారెస్పీలోకి 2,894 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ జలాశయంలోకి 2,894 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 261 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికిప్రాజెక్ట్‌లో 1064 (14.77 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో

నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు గురువారం తెలిపారు. క్యాచ్‌మెంట్ ఏరియాతోపాటు ఎగువన కుండపోతగా కురిసిన వర్షానికి వరద వస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1392 అడుగుల (5.2 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇద్దరు ఏఎస్సైలకు పదోన్నతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ని ఇద్దరు ఏఎస్సైలు ఎస్సైలుగా పదోన్నతి పొందారు. రుద్రూర్ ఏఎస్సై రాజు, సీసీఎస్ ఏఎస్సై జవాన్ భీమ్ రావులకు ఎస్సైలుగా ప్రమోషన్ రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు గురువారం సీపీని కలిశారు. పోలీస్ కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం రవిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. 2002లో నిజామాబాద్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా రవిబాబు పనిచేశారు. బదిలీపై అమరచింతకు వెళ్లారు. తిరిగి మళ్లీ నగరానికే డిప్యూటీ కమిషనర్‌గా వచ్చారు. డీసీ రవిబాబుకు రెవెన్యూ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

భూభారతిపై ఎన్నో ఆశలు

భూభారతి రెవెన్యూ సదస్సులతో తమ భూ సమస్యలు పరిష్కారమై న్యాయం జరుగుతుందని వేలాది మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులలో 39 వేలకు పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అర్జీలు పెట్టుకున్న రైతులకు సమస్య పరిష్కారం కోసం అధికారులు నోటీసులు పంపిస్తున్నారు. వివాదాలు లేని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. అత్యధిక దరఖాస్తులు వచ్చిన సాదాబైనామాల అంశం కోర్టులో ఉండగా, అసైన్‌మెంట్ భూముల విషయంలో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.



డిచ్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

- భూ సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూపులు
- జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 39,806
- రెండంచెల్లో పరిశీలన చేయనున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భూభారతి పోర్టల్ ద్వారా తమ భూసమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ధరణి స్థానంలో వచ్చిన భూభారతికి జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 3 నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. వివిధ సమస్యలకు సంబంధించి అన్ని మండలాల్లో కలిపి 39,806 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ముఖ్యంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యుటేషన్లు, పేర్ల మార్పులు, అసైన్డ్ భూముల సమస్యలు ఇతరాలు ఉన్నాయి. మిస్సింగ్ సర్వే నంబర్ల విషయానికి వస్తే 6,898, పెండింగ్ మ్యుటేషన్లు 1,121, పేర్ల మార్పు 914, అసైన్డ్ భూముల సమస్యలు 494, ఇతర భూసమస్యలకు సంబంధించి 22,254 దరఖాస్తులు ఉన్నాయి. ఇదిలా ఉండగా సాదాబైనామాలకు సంబంధించి అన్ని మండలాల్లో కలిపి 30,442 దరఖాస్తులు రాగా ఇందులో 11,891 తిరస్కరణకు గురయ్యాయి. మరో 18,551 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో రెండంచెల్లో దరఖాస్తులను పరిశీలిస్తారు.

పెండింగ్‌లో సాదాబైనామాల దరఖాస్తులు

సాదాబైనామాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో రావాల్సి ఉండడంతో తిరస్కరణకు గురైన దరఖాస్తులను తీసేస్తే మిగిలిన వాటిని రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో ఉంచారు. సాదాబైనామాల అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది.

అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటైన తర్వాతే..

అసైన్‌మెంట్ భూముల విషయానికి వస్తే అన్ని మండలాల్లో అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాకపోవడంతో ఈ కమిటీల ఏర్పాటు ప్రక్రియ మొదలు కాలేదు. మిగిలిన సమస్యల విషయమై వివాదాలు లేని వాటిని క్లియర్ చేస్తున్నారు.

మూడంచెల వారీగా నోటీసులు..

దరఖాస్తుల్లో ఆయా సమస్యలకు సంబంధించి తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్‌ల ద్వారా నోటీసులు పంపిస్తున్నారు. వీటిలో అత్యధికం తహసీల్దారు, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయి. ఇక తహసీల్దారు వద్ద పరిష్కారం కాకపోతే ఆర్డీవో వద్ద, ఆర్డీవో వద్ద పరిష్కారం కాకపోతే కలెక్టర్ వద్దకు వెళ్లే అవకాశం ఉంది. కలెక్టర్ వద్ద కాకపోతే ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం కల్పించారు.

సాదాబైనామాలు, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి మినహా ఇతర దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నట్లు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

పసుపు బోర్డు కేంద్రం ఇచ్చిన బహుమతి

- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి
- ఎంపీ అర్వింద్ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది
- నిజామాబాద్ జిల్లా రైతు ఉద్యమాలకు కేంద్రబిందువు
- అమిత్ షా సభను జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

సుభాష్‌నగర్ : పసుపు బోర్డు ఏర్పాటు జిల్లా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బహుమతి అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎంపీ అర్వింద్ ధర్మపురితో కలిసి గురువారం ఆయన వీక్షించారు. అనంతరం విలేకరులతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పసుపు బోర్డు కావాలనే 40 ఏళ్ల రైతుల ఆకాంక్ష, అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా కేంద్రం ప్రకటించిందని, ఎంపీ అర్వింద్ కృషితో రాష్ట్ర, జాతీయ పార్టీ నిర్ణయం, ప్రధాని మోదీ ఆశీస్సులతో పసుపు బోర్డు ఏర్పడిందన్నారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. పసుపు బోర్డు తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఇతర రాష్ట్రాలు అడిగాయని, మోదీ చివరకు నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన రైతుబిడ్డనే నియమించారన్నారు. ఈ నెల 29న జాతీయ పసుపు బోర్డు కార్యాలయం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చనుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని కూడా అమిత్ షా ఆవిష్కరిస్తారని తెలిపారు. రైతు సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలకు నిజామాబాద్ జిల్లా కేంద్రబిందువని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసుకుని సమస్యలపై పోరాటం చేస్తారన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా రైతులు సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం తర్వాత బోర్డు లోగోను అమిత్ షా ఆవిష్కరిస్తారని తెలిపారు.

రైతు సమ్మేళనానికి తరలిరావాలి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పసుపు బోర్డు కేంద్ర కార్యాలయం ప్రారంభించిన తర్వాత పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే రైతు సమ్మేళన బహిరంగ సభకు హాజరవుతారని, రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పిలుపు నిచ్చారు. సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, నాయకులు బద్దం లింగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, మోరెపల్లి సత్యనారాయణ, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, బోగ శ్రావణి, గోపిడి స్రవంతిరెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్, మాదాసు స్వామి యాదవ్, పంచరెడ్డి ప్రవళిక పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ తదితరులు

పాలిటెక్నిక్ మైదానం పరిశీలన

సుభాష్‌నగర్: ఈ నెల 29న రైతు సమ్మేళన బహిరంగ సభ జరిగే పాలిటెక్నిక్ కళాశాల మైదానాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, హెలీప్యాడ్ తదితర వివరాలను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభా వేదిక, భద్రత వంటి వివరాలను ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. అంతకుముందు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్రమంత్రి పరిశీలించారు. చైర్మన్, చాంబర్ల ఏర్పాటు తదితర పనులపై చైర్మన్ పల్లె గంగారెడ్డి వివరించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- మెడికల్ కాలేజీలో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు సదుపాయాలు కల్పించాలి
- వైద్యాధికారులకు సూచించిన డీపీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- జీజీహెచ్, మెడికల్ కళాశాల తనిఖీ



జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న డీపీహెచ్ రవీందర్ నాయక్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు



మాట్లాడుతున్న డీపీహెచ్, కలెక్టర్

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకులు (డీపీహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాలను కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి డీపీహెచ్ రవీందర్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఐసీయూ, ఆర్ఐసీయూ, ల్యాబ్, బ్లడ్ బ్యాంకు, టీ హబ్ తదితర వాటిని పరిశీలించారు. వైద్య కళాశాలలో ఫిజియాలజీ, అనాటమీ, హెమటాలజీ ల్యాబ్‌లు, లైబ్రరీ, లెక్చరర్ హాల్ ఇతర విభాగాలను సందర్శించారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా డీపీహెచ్ రవీందర్ నాయక్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఎన్‌ఎంసీ అనుమతుల మంజూరులో ఇబ్బందులకు ఆస్కారం ఉండదన్నారు. వైద్య విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఉండాలన్నారు. ఖాళీలు ఉంటే, వాటి వివరాలను సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అవసరమయ్యే వైద్య పరికరాలు, యంత్రాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్‌లకు సూచించారు. తాము క్రమం తప్పకుండా ఆస్పత్రిని తనిఖీ చేస్తానని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. వీరి వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ శ్రీ, వైద్య విభాగాల అధిపతులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పాల్గొన్న సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్ తదితరులు

కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలి

- కేంద్ర హోంమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, సీపీ సమీక్ష

నిజామాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలో నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ నెల 29న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య జిల్లా అధికారులతో సమీక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెలిప్యాడ్‌ను సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కేంద్ర హోం మంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఎగబడిన రైతులు



జలాల్‌పూర్‌లో యూరియా కోసం లారీ వద్ద నిలబడిన రైతులు

బాల్కొండ: బాల్కొండ మండలం జలాల్ పూర్ గ్రామంలో రైతులు యూరియా కోసం బారులు తీరారు. గ్రామానికి 425 యూరియా బస్తాలు అవసరం ఉండగా గురువారం కేవలం 225 బస్తాలు మాత్రమే సరఫరా చేయడంతో రైతులు ఎగబడ్డారు. ముందస్తుగా ఎక్కువ మొత్తంలో బస్తాలను నిల్వ ఉంచుకోవడం కోసం తరలివచ్చారు. ఈ విషయమై బాల్కొండ వ్యవసాయ అధికారిణి బద్దం లావణ్యను వివరణ కోరగా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కోర్టు ప్రాంగణంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

- జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

నిజామాబాద్ లీగల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవా సంస్థ ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ దేశంలో విలువైన మానవ వనరుల్ని మాదక ద్రవ్యాలు దెబ్బతీస్తున్నాయని, ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎవరూ మాదకద్రవ్యాలను వినియోగించకుండా చూడాలని, వాటి నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, తమపై పెట్టుకున్న ఆశలను మమ్మూ చేయకుండా, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు, జడ్జీలు హరీశ, ఆశాలత, వడ్డీ హరికుమార్, శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ, గోపికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్ రాజ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చీఫ్ రాజ్‌కుమార్ సుబేదార్, అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

- సీపీ సాయి చైతన్య



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి : మాదకద్రవ్యాలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పోతరాజు సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ నుంచి రాజీవ్ గాంధీ ఆడిటోరియం వరకు గురువారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత కొంతమంది చెడుమార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించేవారు వారి మానసికస్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ కరోలినా ఛాంగ్ ఎన్ మావీ, ఏసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీసీ సోమిరెడ్డి, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని యూనివర్సిటీల లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రఘురాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పీజీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఉచితంగా మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ సంజీవ్, కో కన్వీనర్ చందు, నాయకులు అజయ్, నవీన్, కుషాల్, టోకు, లక్ష్మణ, చతుర్ సింగ్, పీరు పాల్గొన్నారు.

పాఠశాల గది సీజ్

నిజామాబాద్ అర్బన్: నగరంలోని నారాయణ పాఠశాలలో బుక్స్, దుస్తులు విక్రయిస్తున్న గదిని అధికారులు గురువారం సీజ్ చేశారు. పాఠశాలలో బుక్స్, దుస్తులు విక్రయిస్తున్నట్లు టీజీవీపీ నాయకులు ఎంఈవోకు సమాచారం అందించారు. పాఠశాలకు వచ్చి విచారించిన ఎంఈవో బుక్స్ విక్రయిస్తున్నట్లు తేలడంతో గదిని సీజ్ చేయించారు.

సమ్మెను జయప్రదం చేయాలి



నిజామాబాద్ సిటీ: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని, సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ నాయకులు భూమన్న, దాసు కోరారు. నగరంలోని కోటగల్లి ఎన్ఆర్‌భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం విధించారని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు వర్తింపజేసి, పని భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సూర్య, శివాజీ, నీలం సాయిబాబా, మల్లికార్జున్, శివకుమార్, జేపీ గంగాధర్, వి బాలయ్య, భారతి, మోహన్, రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని కానిస్టేబుల్

- జరిమానా విధించిన అధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు ట్రాఫిక్ నిబంధనలు పాటించనందుకు జరిమానా విధించారు. సదరు కానిస్టేబుల్‌కు చెందిన బుల్లెట్ బండి శబ్ద కాలుష్యంతో ప్రయాణించడంతో రూ.1400 జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ గురువారం తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ట్రాఫిక్ పోలీస్‌కే జరిమానా విధించడం పోలీస్ వర్గాల్లో చర్చకు తెరలేపింది.

ఈ-కేవైసీ తప్పనిసరి

నస్రుల్లాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం కిసాన్ పథకం కింద రైతులకు అందించే పెట్టుబడి సహాయం కోసం రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని ఏఈవో గ్రీష్మ అన్నారు. అందులో భాగంగా మిర్జాపూర్ క్లస్టర్‌కు సంబంధించి 34 మంది చేసుకోలేదని తెలిపారు. ఈసందర్భంగా గురువారం కామిశెట్టిపల్లిలో ఫేసియల్ యాప్ ద్వారా కేవైసీ చేశామన్నారు. డబ్బులు పడుతూ కేవైసీ చేసుకోని వారు ఉన్నా కూడా తప్పకుండా ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు.

గోపాల మిత్రల గోడు పట్టదా!

- తొమ్మిది నెలలుగా అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు



గగ్గుపల్లి గ్రామంలో ఆవుకు కృత్రిమ గర్భాధారణ చేస్తున్న గోపాల మిత్ర (ఫైల్)



ఫత్తేపూర్‌లో కృత్రిమ గర్భాధారణతో జన్మించిన దూడల వద్ద గోపాల మిత్రలు (ఫైల్)

పెర్కిట్(ఆర్మూర్): పాడి పరిశ్రమలో కీలక పాత్ర పోషిస్తున్న గోపాల మిత్రలకు ప్రభుత్వం నుంచి 9నెలలుగా జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. అసలే చాలీచాలని గౌరవ వేతనంతో నెట్టుకొస్తున్న తమకు సకాలంలో జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు లేక కుటుంబ పోషణ భారమవుతుందని పేర్కొంటున్నారు.అయినా తమ దుస్థితిని ఎవరూ పట్టించుకోవడంలేదంటున్నారు.

చాలీచాలని వేతనం..

పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోపాల మిత్రలకు ప్రతి నెల లక్ష్యాలను నిర్దేశించి పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయిస్తున్నారు. గోపాల మిత్రలకు జాతీయ కృత్రిమ గర్భాధారణ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ.11,050 చొప్పున అందజేస్తున్నారు. వీరు వేసవిలో నెలకు 50 నుంచి 60, ఇతర సీజన్లలో 100 నుంచి 120 పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఒక్కో కృత్రిమ గర్భాధారణకు రైతుల నుంచి రూ.40లు వసూలు చేసి, ప్రభుత్వ ఖాతాలో జమా చేయాల్సి ఉంటుంది. కృత్రిమ గర్భాధారణ లక్ష్యం పూర్తయిన, కాకపోయిన అనుకున్న సంఖ్య ప్రకారం ప్రభుత్వ ఖాతాల్లో వారు డబ్బులు జమా చేయాలి. ఒక్కోసారి అనుకున్న లక్ష్యం పూర్తి కాకపోతే వారి జీతం నుంచి కోతలు తప్పవు. అసలే చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడుతుంటే అందులో కోతలు విధిస్తుంటే ఏమి మిగలడం లేదని వారు వాపోతున్నారు. అలాంటిది 9నెలలుగా జీతాలు రాకపోవడంతో తమ కష్టాలు తీవ్రంగా మారాయంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే వేతనాలు అందించాలని గోపాల మిత్రలు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 132 మంది..

గ్రామాల్లో పశువుల సంరక్షణకు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ(డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ద్వారా గోపాల మిత్ర వ్యవస్థను 2000 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా అయా గ్రామాల్లో 132 మంది గోపాల మిత్రలు సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయడంతోపాటు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్సలు అందిస్తున్నారు. అలాగే పశు వైద్యుల సూచనల మేరకు నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్ వంటి అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నారు.

కుటుంబ పోషణ భారంగా మారింది..



తాము చాలీచాలని జీతంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. దీనికి తోడు తొమ్మిది నెలలుగా జీతం రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం మా కు ఉద్యోగ భద్రత కల్పిస్తారని ఆశతో 24సంవత్సరాలుగా సేవలందిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

–ఉంగరాల రాజన్న, గోపాల మిత్ర, ఇస్సాపల్లి

బాల్కొండలో యాంటీ డ్రగ్ డే



బాల్కొండ ఉన్నత పాఠశాల ఆవరణలో యాంటీ డ్రగ్ ఆకారంలో నిల్చున్న విద్యార్థులు, యువకులు

బాల్కొండ: మండలంలో గురువారం అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ గురువారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ , ర్యాలీలు నిర్వహించారు. బాల్కొండ ఉన్నత పాఠశాల ఆవరణలో యాంటీ డ్రగ్ ఆకారంలో విద్యార్థులు, యువకులు నిలబడ్డారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్, రజనీకాంత్, పోలీస్ సిబ్బంది, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకం పేరుతో సైబర్ మోసం

- ఎడపల్లికి చెందిన రైతు నుంచి రూ.2లక్షలు కొట్టేసిన మోసగాళ్లు

బోధన్: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు ఇందూర్ శంకర్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి సుమారు రూ.2లక్షలు పోగొట్టుకున్నాడు. పోలీసులు, బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా.. శంకర్ ఈ నెల 23న పొలంలో పనులు చేస్తుండగా ఆయన మొబైల్‌కు పీఎం కిసాన్ పథకానికి సంబంధించి మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్ చేయగానే వరుసగా ఓటీపీలు వచ్చాయి. అనుమానం వచ్చి ఫోన్ నెట్ ఆఫ్ చేసుకున్నాడు. ఆ తర్వాత సిమ్ బ్లాక్ అయింది. మరుసటి రోజు బ్యాంక్‌కు వెళ్లి బ్యాలెన్స్ పరిశీలించగా ఆయన మొదట ఖాతాలోకి రూ.35వేలు జమా అయ్యాయి. తదనంతరం తన ఖాతాలోని నిల్వ డబ్బులు రూ.2లక్షల 3వేలు డ్రా అయ్యాయి. ఈ విషయం తెలుసుకుని మోసపోయానని గ్రహించి ఎడపల్లి పోలీసులకు శంకర్ ఫిర్యాదు చేశాడు.

దరఖాస్తులు చేసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతన నిమిత్తం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కార్మిక వైద్యశాల సీనియర్ ఫార్మాసిస్ట్ యాదగిరి గురువారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న బస్సు : ఒకరి మృతి



కోటార్మూర్‌లో బైక్‌ను ఢీకొన్న బస్సు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో బైక్‌ను ఓ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోటార్మూర్‌కు చెందిన మామిడి మహేష్ (38) గురువారం ఉదయం తన బైక్‌పై తన భార్య లావణ్యను మహిళా ప్రాంగణ సమీపంలో ఓ పనికి దించి ఇంటికి బయలుదేరాడు. కాగ కోటార్మూర్‌లోని తిరుపతి ఆస్పత్రి వద్ద అతడి బైక్‌ను జగిత్యాల డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్‌కు తీవ్రమైన గాయాలవ్వడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

పాముకాటుతో ఒకరు..



భుక్యా కపుర్యా (ఫైల్)

కామారెడ్డి క్రైం: గుడిసెలో నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన భుక్యా కపుర్యా (30) వ్యవసాయం, కూలీ పనులు చేసుకునేవాడు. అతనికి గతంలో వివాహం జరుగగా భార్యతో విడాకులు అయ్యాయి. అతడు బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రించాడు. వేకువజామున మెలకువ వచ్చి చూసుకోగా పాము కాటుకు గురైనట్లు గుర్తించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అర్ధరాత్రి విషసర్పం కాటు వేసి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు నాలుగేళ్ల జైలు

నందిపేట్(ఆర్మూర్): దంపతుల మధ్య జరిగిన గొడవలో భార్యను హత్య చేయడానికి యత్నించిన భర్తకు ఆర్మూర్ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా.. 2024లో నందిపేట మండలంలోని కొల్పూర్ గ్రామంలో ఖాసిం భాష అనే వ్యక్తి తన భార్యతో గొడవపడగా, ఆమెను హత్య చేసేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో అతడి భార్య వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి, నిందితుడిని అరెస్టు చేశారు. ఆర్మూర్ సబ్ కోర్టులో హాజరుపర్చగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి 4 సంవత్సరాల జైలు శిక్షతోపాటు, రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి..

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా సారంగాపూర్‌కు చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో అతడిని గురువారం నిజామాబాద్ కోర్టులో పోలీసులు హాజరు పర్చారు. జడ్జి అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ధర్పల్లి: ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఈనెల 24న పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ధర్పల్లికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిని గురువారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి అతడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న పది మంది అరెస్టు

బాన్సువాడ: బీర్కూర్ మంజీర ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10మందిని అరెస్ట్ చేసినట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లు సీజ్ చేసి, రూ.8300 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214. [H-783418]

సిరి అసోసియేట్స్

■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల & గుణపెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005069]

WANTED

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239. [SCA 25005435]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥ భో+వ+జీ: 16-18 వేలు. 9515119570, 9553461177. [SCA25005422]

FACULTY TEACHERS

■ GEETHA SCHOOL - Toopran
Wanted a well - qualified and experienced LADY PRINCIPAL. Contact No: In charge Principal: T. Premraj - 9491756073, Vice Principal: V. Rajeshwar - 94939 35003. Send your resumes to geethahstoopran@gmail.com [SCA25005509]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కారు బోల్తా: ఐదుగురికి గాయాలు



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ రహదారిపై కారు బోల్తా పడటంతో డ్రైవర్‌తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు బుధవారం కారులో సాటాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వచ్చారు. కార్యక్రమం అనంతరం అదే రాత్రి తిరిగి నగరానికి బయలుదేరారు. సాటాపూర్ రహదారిపై వారి కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన గల గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. డ్రైవర్ సర్పరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

దాబా, హోటళ్లపై పోలీసుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్–సంగారెడ్డి 161 జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాలు, రెస్టారెంట్‌లపై బుధవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల్లోని జాతీయ రహదారి పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సిట్టింగులు, విక్రయాలు జరుపుతున్న దాబాలపై దాడి చేసి, అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్య సిట్టింగులు నిర్వహిస్తున్న దాబా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే ప్రారంభం

మీకు తెలుసా?



ఆలయంలోని అమ్మవారు



శ్రీరాంపూర్‌లోని చిలుకల చిన్నమ్మ ఆలయం

బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు ఏ పార్టీ వారైనా ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని శ్రీరాంపూర్‌గల చిలుకల చిన్నమ్మ ఆలయం నుంచే ప్రారంభిస్తారు. ఈ అమ్మ ఆలయం నుంచే ప్రచారం ప్రారంభించడం సెంటిమెంట్‌గా భావిస్తారు.

- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన శ్రీరాంపూర్ గ్రామం అదే పేరుతో 1963లో బాల్కొండ మండలంలో నూతన గ్రామంగా వెలిసింది. ముంపు గ్రామం నుంచి చిలుకల చిన్నమ్మను తీసుకువచ్చి ఇక్కడ స్థాపించారు.
- భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ఈ ఆలయంలోని చిలుకల చిన్నమ్మ ప్రసిద్ధి చెందింది.
- ప్రతి ఆదివారం, గురువారం ఆలయం వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.
- ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.
- చిలుకల చిన్నమ్మ పేరున గ్రామాల్లో చిన్నయ్య, చిన్నమ్మ నామకరణం చేసుకుంటారు.

మొలకెత్తని సోయా విత్తనాలు



సోయా మొలకెత్తకపోవడంతో పొలాన్ని చూపుతున్న దత్తాపూర్ రైతు లంబాడి రాజు

డొంకేశ్వర్ (ఆర్మూర్): మార్కెట్లో దొరుకుతున్న విత్తనాలతో రైతులు మోసపోతున్నారు. అవి నకిలివో, మంచివో తెలియక కొనుగోలు చేసి విత్తుతున్నారు. ఎన్నిరోజులైనా మొలకలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌కు చెందిన లంబాడి రాజు రూ.10 వేలు ఖర్చు చేసి మూడు సోయా విత్తన ప్యాకెట్లను స్థానికంగా కొనుగోలు చేశాడు. రెండెకరాల్లో విత్తనాలు విత్తి పది రోజులైనా ఇప్పటి వరకు మొలకలు రాలేదు. నీటిని అందించినా అంతే పరిస్థితి ఉండడంతో పెట్టుబడిని కోల్పోయాడు. చేసేదేమి లేక మళ్లీ రూ.5వేలు పెట్టి మక్క విత్తనాలు కొని సోయా వేసిన పొలంలోనే విత్తాడు. ఈవిధంగా దత్తాపూర్‌లోనే కాకుండా మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో చాలా మంది రైతులు వేసిన సోయా విత్తనాలు మొలకెత్తలేదని పేర్కొంటున్నారు. ఐతే, స్థానికంగా గ్రామాల్లో లైసెన్సు లేని కొంతమంది వ్యాపారులు విత్తనాలు తయారు చేసి రైతులకు అంటగడుతున్నారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



మాక్లూర్ మండలం కృష్ణానగర్ గ్రామ శివారులో ఏపుగా పెరిగిన బెండకాయతోట

బెండ సాగు.. బహు బాగు



బెండకాయలను తెంపుతున్న మహిళ

నిజామాబాద్ జిల్లాలో రైతులు వరి, మొక్కజొన్న, టమాటా పంటలే కాకుండా కూరగాయల సాగును సైతం చేపడుతున్నారు. ఈనేపథ్యంలోనే మాక్లూర్ మండలం కృష్ణానగర్ గ్రామ శివారులో స్థానిక రైతు నర్సింలు తన కున్న 5 ఎకరాల్లో బెండకాయ తోట సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం కాయలు కాయడంతో నిత్యం కూలీలు వచ్చి, బెండకాయలను తెంపుతూ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గురువారం తోటలో కూలీలు బెండకాయలను తెంపుతుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది. నిత్యం నిజామాబాద్ మార్కెట్‌కి పంటను తీసుకువచ్చి హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నట్లు రైతు తెలిపారు.

–సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నిజామాబాద్

ప్రేమ వ్యవహారంలో బెదిరింపులు: యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు ఓ యువతిని ప్రేమించగా, విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు బెదిరింపులకు పాల్పడటంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రాపర్తి సాయిలు–అంజవ్వ దంపతులకు ఓ కూతురు, కొడుకు శ్రీకాంత్(21) ఉన్నారు. వారం రోజుల క్రితం కూతురును తీసుకొని దంపతులిద్దరూ హైదరాబాదుకు బతుకుదెరువు కోసం వెళ్లారు. కొడుకు ఒక్కడే ఒంటర్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ అదే గ్రామానికి చెందిన ఓ యువతి గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలిసిన యువతి మామ శ్రీకాంత్‌పై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి శ్రీకాంత్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన కొడుకు ఆత్మహత్యకు కారణం యువతి కుటుంబ సభ్యులే అని శ్రీకాంత్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. గ్రామానికి ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై వెంకట్రావు, పోలీసులు చేరుకొని ఇరువర్గాల వారిని సముదాయించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్ వద్దకు ఇటీవల లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన బేగరి సాయిలు అనే వ్యక్తి వచ్చి కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలని వచ్చాడు. పత్రాలు సరిగా లేవని ఎంపీడీవో ప్రకాష్ సంతకాలు పెట్టేందుకు నిరాకరించాడు. దీంతో సాయిలు ఎంపీడీవో విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ విషయమై ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

5.25 కిలోల గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ గ్రామ శివారులో దారు కుమార్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని తనిఖీ చేయగా అతని ప్యాంటు జేబులో ఐదు గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అనంతరం ఒక బ్యాగులో ఉన్న 5.25 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం ఎండు గంజాయిని, నిందితుడిని, సెల్‌ఫోన్‌ను నిజామాబాదు రూరల్ ఎస్సైకి అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సై గోవింద్ తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి వీరంగం



ధ్వంసమైన బైక్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ సంతోష్ అనే యువకుడు మతిస్థిమితం కోల్పోయి గత కొద్ది రోజులుగా తండాలో వీరంగం సృష్టిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం అతడికి ఎదురువచ్చిన తండావాసులను రాళ్లతో, కర్రలతో కొడుతూ అసభ్యకరమైన మాటలతో దూషించాడు. తండాకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఫర్నిచర్, టీవీ, వంటపాత్రలు, రెండు బైక్‌లను ధ్వంసం చేశాడు. దీంతో సుమారు రూ. 2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. సంతోష్ చేష్టలతో విసిగిపోయిన తండావాసులు అతడిని బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో సైతం రాళ్లు రువ్వుతూ అతడు దాడి చేశాడు. వెంటనే సీఐ రవీందర్‌నాయక్ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను పిలిపించి మత్తు ఇంజక్షన్ ఇప్పించారు. గంట తర్వాత సంతోష్ అరవడం మానేశాడు. అనంతరం వైద్య చికిత్సల నిమిత్తం అతడిని ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు.

బాబాయ్ మృతితో కుంగిపోయి..

సంతోష్ వింత చేష్టలతో ఎల్లారెడ్డి సీఐ అతడిపై ఆరా తీశారు. సంతోష్ బాబాయి అయిన దేవసోత్ పకీరాను గత నెల 24న కన్న కొడుకు ప్రకాష్ గొడ్డలితో నరికి చంపాడు. పకీరా మృతి చెందిన సమయంలో అక్కడే ఉన్న సంతోష్ ఇంట్లో పడిన రక్తాన్ని తొలగించి శుభ్రం చేశాడు. అప్పటి నుంచి సంతోష్ మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయినట్లు తండావాసులు తెలిపారు. మంచి భవిష్యత్ ఉన్న యువకుడు మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.